సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఏయూను సందర్శించిన సమాచార హక్కు కమిషనర్



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుస్తకాన్ని బహూకరిస్తున్న కమిషనర్ శామ్యూల్

విశాఖ విద్య: రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాధన్ సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌కు 'గుంటూరు–త్రూ ద ఏజెస్' అనే ప్రత్యేక పుస్తకాన్ని కమిషనర్ బహూకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల జరుగుతున్న సందర్భంగా ఇదే తరహా పుస్తకాన్ని తయారు చేయడానికి ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు. ఏయూ వీసీ రాజ శేఖర్ దృష్టికి దీన్ని తీసుకెళ్లి అనుమతి తెలియ జేస్తామని రిజిస్ట్రార్ అన్నారు. అనంతరం పలు అంశాలపై వీరు చర్చించారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



ఆటోలో వెల్లకిలా పడి మృతి చెందిన వ్యక్తి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యం మత్తులో మృతి చెందాడు. లా అండ్ ఆర్డర్ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా.. 11వ వార్డు గాంధీనగర్‌కు చెందిన స్వామి(40) అవివాహితుడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగాడు. రాత్రి ఇంటికి చేరలేదు. సోమవారం తెల్లవారేసరికి అదే వార్డు వికలాంగుల కాలనీలోని ఓ ఆటోలో వెల్లకిలా పడి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆటోలో కూర్చొని పూటుగా తాగిన మైకంలో అదే ఆటోలో వెల్లికిలా పడిపోయాడు. ముఖం కిందకు ఉండటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

ముగిసిన 'క్షమత' టీచర్ శిక్షణ

బీచ్‌రోడ్డు: కోటక్ మహీంద్రా ఆధ్వర్యంలో రాష్ట్రంలో కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని ఫౌండేషన్ సీఈవో డాక్టర్ గణేశ్ రాజా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మూడో రోజుల పాటు నిర్వహించిన క్షమత టీచర్ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుల కోసం క్షమత వన్ కేఈఎఫ్ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లలో ఆవిష్కరించామన్నారు. ఏపీలోని 186 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలు, 108 మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలల్లో క్షమత డిజిటల్ విద్య అమలులోకి వస్తోందన్నారు. విద్యార్థుల విద్యా ఫలితాలను మెరుగుపరచడంలో సహాయపడుతుందని చెప్పారు. జాతీయ విద్యా విధానం ఆధారంగా రూపొందించిన శిక్షణ మాడ్యూళ్లు, జీవితానుభవాలపై ఆధారపడి ఉండే నేర్చుకునే విధానాలు ఈ కార్యక్రమంలో ఉన్నాయన్నారు.

నల్లి ధర్మారావుకు చందు సాహితీ పురస్కారం



సీతంపేట: చందు సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రతి ఏటా సాహితీవేత్తలకు ఇస్తున్న ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారాన్ని రచయిత, కవి, శ్రీకాకుళం జిల్లా అరసం అధ్యక్షుడు నల్లి ధర్మారావుకు అందించాలని చందు ట్రస్టు కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు, ప్రఖ్యాత కవి కొలకులూరి ఇనాక్, ప్రజాకవి గోరేటి వెంకన్న, నన్నయ యూనివర్సిటీ వీసీ సాతుపాటి ప్రసన్న, సాహితీవేత్త డి.వి.సూర్యారావు వంటి ఎందరో అందుకున్నారని తెలిపారు. ఈ నెల 18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగే ట్రస్ట్ వార్షికోత్సవ సభలో ధర్మారావుకు పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు.

ప్రమాదకరంగా పార్క్ మెట్లు



తీరంవైపు దెబ్బతిన్న పార్క్ మెట్లు

పార్క్ లోపల నుంచి బీచ్‌లోకి వెళ్లడానికి వీలుగా వెనుక భాగంలో గేటు, మెట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మెట్లు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. వీటికి మరమ్మతులు చేయాల్సిన అవసం ఉంది. వెనుక భాగంలో ఉండే ఇనుప గేటు తుప్పుపట్టి విరిగిపోయింది. గేటులో ఒక భాగం సముద్రపు ఇసుకలో పడి ఉంది. దీని చుట్టూ లతలు అల్లుకుపోతున్నాయి. మరో భాగాన్ని పార్క్‌లో పిల్లలు ఆడుకునే చోట పడేశారు.



సాగర తీరంలోని ఆల్ ఎబిలిటీ పార్క్‌లో శిథిలమైన రక్షణ వలలు

ఆట వస్తువులు శిథిలం

ప్రస్తుతం పార్క్‌లో ఉన్న ఆట వస్తువులన్నీ దాదాపుగా శిథిలమయ్యాయి. జారుడు బల్ల మెట్లు విరిగిపోవడంతో చిన్నారులు అది ఎక్కే పరిస్థితి కూడా లేదు. కేవలం ఒక్క సీసీ మాత్రం పూర్తిస్థాయిలో పనిచేస్తోంది. మరికొన్ని ఆట వస్తువులు తుప్పుపట్టి చిన్నారులు పొరపాటునతాకితే గాయాలయ్యేలా ఉన్నాయి.



తుప్పు పట్టిన ఆట వస్తువులు

తుప్పుపట్టి పాడైన ఆట పరికరాలు | విరిగిన పార్క్ గేటు, మెట్లు | ఆటలకు ఇబ్బంది పడుతున్న చిన్నారులు | దృష్టి సారించని అధికారులు

ఆటంకం

అభివృద్ధికి దూరంగా ఆల్ ఎబిలిటీ పార్క్

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో వైఎంసీఏకు ఎదురుగా ఉన్న ఆల్ ఎబిలిటీ పార్క్ అభివృద్ధికి ఆమడ దూరంగా నిలిచింది. గతంలో బాలలందరూ ఆడుకోవడానికి వీలుగా ఈ పార్క్‌ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఆట వస్తువులు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడకి పదుల సంఖ్యలో చిన్నారులు ఆడుకోవడానికి వస్తుంటారు. ఆట పరికరాలు దెబ్బతినడంతో వీరికి తీవ్ర నిరాశే ఎదురవుతోంది.

దెబ్బతిన్న రక్షణ వల

పార్క్ లోపలకి వచ్చిన వారు మరింత ఆహ్లాదాన్ని పొందేలా మధ్యలో ఓడ వంటిది నిర్మించారు. దీని పైకి ఎక్కే సమయంలో చిన్నారులు పడిపోకుండా ప్రత్యేకమైన వలతో రక్షణ కల్పించారు. ప్రస్తుతం ఇది దెబ్బతిని పలుచోట్ల చిరిగిపోయింది. దీనితో దీనిపైకి చిన్నారులు ఎక్కితే తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పచ్చదనం మాయం

పార్క్ అనగానే పచ్చని మొక్కలు ఉంటాయని అందరూ భావిస్తారు. ఇక్కడ ఉన్న కొద్దిపాటి మొక్కలు సైతం ఎండిపోతున్నాయి. కొన్ని బీచ్ నుంచి వచ్చే తేమకు ఎండిపోతుండగా.. మరికొన్ని తగిన నిర్వహణ లేక మోడువారిపోతున్నాయి. పార్క్‌లో ఆహ్లాదాన్ని పెంచే మెక్కలను మరింత విరివిగా నాటాల్సిన అవసరం ఉంది.



విరిగి దూరంగా పడిన గేటు



పార్క్ మధ్యలో ప్రమాదకరంగా ఇనుప ఊచలు



ఆల్ ఎబిలిటీ పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

ఆహ్లాదం కరువు.. సమస్యలకు నెలవు

పేరుకే ఆల్ ఎబిలిటీ పార్క్.. ఇక్కడ అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. పార్క్‌లో చిన్నారులు ఆడుకోవడానికి అనువైన పరిస్థితులు, పరికరాలు, ఆట వస్తువులు లేవు. దీంతో సాయంత్రం వేళల్లో వచ్చే చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి వచ్చే పిల్లలతోపాటు పెద్దలకు ఆహ్లాదం కరువైంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, నాణ్యమైన ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, సందర్శకులు కోరుతున్నారు.

ఆ కార్పొరేటర్ అవసరం తీరిపోయిందా..?

ఆరిలోవ: జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీ వాడుకొంది. రూ.లక్షలతోపాటు జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మళ్లీ మీకే టిక్కెట్ ఇస్తామని, అంతవరకు వార్డులో ప్రాధాన్యతలో ముందు వరుసలో పెడతామని టీడీపీ నాయకులు నమ్మబలికారు. దీంతో 2021లో వైఎస్సార్‌సీపీ బీ ఫారంపై ప్రజల ఓట్లతో గెలుపొందిన కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానంలో టీడీపీకి అనుకూలంగా ఓటేశారు. అప్పటివరకు మేయర్‌గా ఉన్న గొలగాని హరివెంకటకుమారిని పదవి నుంచి దించేశారు. అనంతరం టీడీపీ అభ్యర్థి మేయర్‌గా ఎన్నికయ్యే వరకు ఆ కార్పొరేటర్ల కాళ్లవేళ్లా పడ్డారు. మేయర్ ఎన్నిక జరిగిపోగానే.. కరివేపాకు మాదిరిగా కార్పొరేటర్లను తీసిపారేస్తున్నారు.

అలిగిన కార్పొరేటర్.. కార్యక్రమాలకు గైర్హాజరు

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతను, ఆమె భర్త సత్యనారాయణను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పట్టించుకోవడం లేదట. దీంతో ఆ కార్పొరేటర్ అలిగినట్లు విశ్వసనీయ సమాచారం. 13వ వార్డులో సోమవారం మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి ప్రారంభించారు. ప్రోటోకాల్ ప్రకారం వార్డు కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. కార్పొరేటరే ఎమ్మెల్యేను ఆహ్వానించాలి. ఇక్కడలా జరగలేదు. వెలగపూడి సూచనల మేరకు వార్డులో ఓ కార్యకర్త శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, ఎమ్మెల్యే వస్తారు, మీరు కూడా రండంటూ కార్పొరేటర్‌కు సమాచారమిచ్చాడట. దీంతో కోపం వచ్చిన కార్పొరేటర్ సునీత అలిగి కార్యక్రమానికి వెళ్లడం మానేసినట్లు తెలిసింది. దీంతోపాటు ఆదివారం ఈ ప్రాంతంలో జరిగిన మరో కార్యక్రమానికి కూడా కార్పొరేటర్ గైర్హాజరయ్యారు. అవసరం కోసం ఉపయోగించుకుని.. ఆ తర్వాత కరివేపాకు మాదిరిగా విడిచి పెట్టేశారంటూ పాపం కార్పొరేటర్ కార్యకర్తల వద్ద మదనపడుతున్నట్లు తెలిసింది. కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ ఇచ్చిన పార్టీని, ఎంతో ఆదరించి గెలిపించిన ప్రజలను కాదని టీడీపీ కండువా కప్పుకున్నందుకు తగిన శాస్తి జరిగిందంటూ స్థానికుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.



13వ వార్డులో కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి. చిత్రంలో కనిపించని కార్పొరేటర్ సునీత

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి పర్యావరణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రీన్ క్లైమేట్ టీమ్

ఎంవీపీకాలనీ: జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–12 ఉషోదయ కూడలి వద్ద సోమవారం పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో ప్రతి ఒక్కరూ దేశీయ పండ్ల విత్తనాలను సేకరించాలని సూచించారు. వాటితో విత్తన బంతులు తయారీ చేసి సామాజిక వనాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. తద్వారా భూమి మీదున్న జీవరాశి, ప్రకృతిని కాపాడుకోవడంలో అందరూ బాధ్యులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి పర్యావరణ దినోత్సవ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిత్రకారిణి పూర్వీ రజాక్, ఉపాధ్యాయులు పి.రాధాకృష్ణ, గ్రీన్ వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఆర్ నగర్‌లో మేడే ఉత్సవాలు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు బీఎస్‌ఆర్ నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎర్ర జెండాలు పట్టుకొని విప్లవ గీతాలు ఆలపించారు. బాలికల ప్రదర్శించిన నృత్యాలు స్థానికులను అలరించాయి. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణ కోసం అంతా కలసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కంపెనీలు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఎనిమిది గంటలు పని దినాలు నిర్ణయించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలు, హక్కులు యాజమాన్యానికి అనుకూలంగా మార్చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ దానికి మరింత సహకారం అందిస్తోందన్నారు. కార్మికుల హక్కులను రక్షించుకోవడానికి సంఘాలుగా ఏర్పడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, అప్పలరాజు, నాగరాజు, శంకర్, రమణ, కొండమ్మ పాల్గొన్నారు.



ఎర్ర జెండా పాటలు పాడుతున్న సీపీఎం నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



చినగదిలి తహసీల్దార్‌కు మెమొరాండం అందిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు



సీతమ్మధార తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మద్దిలపాలెం డిపో నాయకులు

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చినగదిలి మండల తహసీల్దార్‌కు వాల్తేర్ డిపో ఆర్టీసీ ఉద్యోగులు మెమొరాండం అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా వివిధ రకాల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సంస్థ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 5వ దశ ఉద్యమ కార్యాచరణగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుంచి స్థానిక తహసీల్దార్‌లకు మెమొరాండం అందజేసే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. యూనియన్ వాల్తేర్ డిపో కార్యవర్గం ఆధ్వర్యంలో చినగదిలి తహసీల్దార్‌కు డివిజనల్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, డిపో చైర్మన్ బి.రవి, డిపో కార్యదర్శి వసంతరావు తదితరులు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను ఎటువంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ ద్వారా మాత్రమే కొనాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్ల తోనేనే నడపాలని, ఉద్యోగుల నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ.150 నుంచి రూ.400కు పెంచాలని, అన్యాయంగా ఉద్యోగుల సస్పెన్షన్లు లేకుండా చర్యలు తీసుకోవాలి వంటి డిమాండ్లపై ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పలువురు ఐ

సమస్యలపై తహసీల్దార్‌కు వినతి

సీతంపేట: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మద్దిలపాలెం ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు సోమవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు చిన్నా, ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీను, జాయింట్ సెక్రటరీ ఒ.వై.బాబు, ఎమ్మెస్ రావు, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కేంద్రం పరిశీలన



బుక్ డిపోను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్ కుమార్, అధికారులు

గాజువాక: గాజువాకలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రం (బుక్ డిపో)ను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ సోమవారం సందర్శించారు. పుస్తకాల పంపిణీకి సంబంధించిన విషయాలను బుక్ డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. బుక్ డిపోకు వచ్చిన పుస్తకాలను ఎప్పటికప్పుడు ఎంఈవో కార్యాలయాలకు చేరే విధంగా చూడాలని డీఈవో సూచించారు. గతంలో 110 టైటిల్స్ ఉన్న పుస్తకాలను ప్రభుత్వం ఇప్పుడు 47 టైటిల్స్‌కు తగ్గించిందని తెలిపారు. వచ్చేనెల 12న పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. పది రోజులుగా పుస్తకాల పంపిణీ కొనసాగుతోందన్నారు. మరో వారం రోజుల్లో మిగిలిన పుస్తకాల పంపిణీ కూడా పూర్తవుతుందన్నారు. బుక్ డిపోను సందర్శించినవారిలో ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, గాజువాక ఎంఈవో సునీత తదితరులున్నారు.

వేసవి వేళ.. ఆటల హేల



తోటగరువు వద్ద పశు సంవర్ధక శాఖ ఖాళీ స్థలంలో ఆటలాడుతున్న పిల్లలు

ఖాళీ స్థలాలు, విశాలమైన రహదారుల్లో యువకులు, చిన్నారుల క్రీడా సందడి

ఆరిలోవ: పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులంతా ఆటపాటలతో కేరింతలు కొడుతూ సందడిగా గడుపుతున్నారు. భానుడి భగభగలతో ఒకవైపు ఇంటి వద్ద రిలాక్స్ అవుతూనే.. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. ఖాళీ ప్రదేశాలు, విశాలమైన రోడ్లే వీరికి క్రీడా స్థలాలుగా మారిపోయాయి. ఆరిలోవ ప్రాంతంలోని ఖాళీ స్థలాలు యువకులు, పిల్లలతో సందడిగా కనిపిస్తున్నాయి. పదుల సంఖ్యలో ఒకచోట చేరి సరదాగా క్రికెట్ మొదలగు ఆటలాడుకుంటున్నారు. ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెటర్నరీ ఆస్పత్రి వెనుక పశు సంవర్ధక శాఖ ఖాళీ స్థలం, హెల్త్ సిటీని ఆనుకొని పినాకిల్ ఆస్పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలం, అపోలో ఆస్పత్రి పక్కన ఖాళీ స్థలం, హెల్త్‌సిటీ రోడ్డు, ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక విశాలమైన రోడ్లు ఆటలకు వేదికయ్యాయి. ఆయా చోట్ల ఉదయం నుంచి బ్యాచ్‌లుగా పిల్లలు కొందరు క్రికెట్ తదితర ఆటలాడుతూ ఎండను సైతం లెక్కచేయకుండా ఎంజాయ్ చేస్తున్నారు. మరికొందరు పిల్లలు జాలీగా సైకిల్ తొక్కుతున్నారు. వేసవి సెలవులు ముగిసే వరకు పిల్లలు ఇలా సందడి చేస్తుంటారు.



హెల్త్ సిటీ పక్కన ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుతున్న యువకులు, పిల్లలు



హెల్త్‌సిటీ రోడ్డులో ఆటలాడుతున్న చిన్నారులు

చిన పోలమాంబ వార్షికోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు



పుష్పాలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామదేవత చిన పోలమాంబ అమ్మవారి వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ వివరాలను సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దువ్వి నాగరాజు, బుద్దల కృష్ణ, గౌరవ అధ్యక్షుడు కొర్రాయి రమేష్‌లు తెలిపారు. వారం రోజుల పాటు రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం భక్తులకు కల్పిస్తామన్నారు. రోజూ సాయంత్రం వేళలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. తొలి రోజు పుష్పాలంకరణలో చిన పోలమాంబ దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు తోనంగి శ్రీనివాసరావు, ఆవాల వెంకటరమణమూర్తి, దువ్వి సంతోష్‌కుమార్, దువ్వి సురేష్‌కుమార్, సహాయ కార్యదర్శులు మువ్వల మౌళి, మడుగుల హరిప్రసాద్, పిల్లల సాంబశివరావు, కార్యనిర్వహణ కార్యదర్శి చెల్లిబోయిన సునీల్‌కుమార్, కోశాధికారి దువ్వి వెంకటస్వామి పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో పుష్పలత ప్రతిభ



అవార్డు అందుకుంటున్న పుష్పలత

విశాఖ విద్య: రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో నగరంలోని ఎన్ఏడీ ఏరియాకు చెందిన నీలాపు పుష్పలత ప్రతిభ చాటింది.ఆంధ్ర ప్రదేశ్ యోగ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 4న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. 30–40 మహిళల విభాగంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది పోటీ పడగా పుష్పలత వేసిన యోగాసనాలకు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం దక్కింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెకు వెండిపతకంతో పాటు సర్టిఫికెట్ అందజేశారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగబోయే జాతీయస్థాయి యోగా పోటీలకు పుష్పలతను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు యోగా సాధకులు అభినందనలు తెలిపారు.